నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, మంగళవారం 18 మార్చి 2025 | HYDERABAD

ఉష్ణోగ్రత కాస్త తగ్గింది..

సిటీబ్యూరో, మార్చి 17 (నమస్తే తెలంగాణ): ఆగ్నేయ దిశ నుంచి వీస్తున్న గాలుల ప్రభావంతో గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. ఆదివారంతో పోల్చితే సోమవారం నాటికి పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. గరిష్ఠం 38.6, కనిష్ఠం 21.6 డిగ్రీలు, గాలిలో తేమ 17శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

అంగన్‌వాడీ టీచర్స్ , హెల్పర్స్ యూనియన్ పిలుపుమేరకు కలెక్టరేట్ వద్ద సోమవారం 48 గంటల ధర్నా యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సునీత శోభారాణి ఆధ్వర్యంలో మొదలైంది. జిల్లా అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రూ.18 వేల జీతం అమలు చేయాలన్నారు. ఈ ధర్నాలో శ్రీనివాస్ , లింగస్వామి తదితరులు పాల్గొన్నారు. - మేడ్చల్ కలెక్టరేట్

పార్కింగ్ పరేషాన్

వేలల్లో పెరుగుతున్న వాహనాలు.. అనుగుణంగా లేని స్థలాలు

నాంపల్లిలో నిర్మాణంలో ఉన్న మల్టీ లెవల్ పార్కింగ్

సిటీబ్యూరో, మార్చి 17(నమస్తే తెలంగాణ) :

శరవేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ నగరానికి పార్కింగ్ అతి పెద్ద సమస్యగా మారుతున్నది. నిత్యం వేలాది కొత్త వాహనాలు రోడ్డెక్కుతున్నా అందుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదు. ఏటా 20 శాతానికిపైగా కొత్త వాహనాలు నగరంలో రోడ్డెక్కుతున్నట్లు అంచనాలు ఉండగా, ఈ లెక్కన వచ్చే ఐదేండ్లలో మరో 25 లక్షల నూతన వాహనాలు సిటీలో సంచరించనున్నాయి.

సరిపడా పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో..

గ్రేటర్‌లో నిత్యం లక్షలాది వాహనాలు తిరుగుతుంటాయి. ఇందులో సగానికి పైగా వాహనాలకు సరిపోయే పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో రోడ్లపైనే వాహనాలను నిలిపి ఉంచాల్సి వస్తున్నది. దీంతో అనివార్యంగా నగరంలో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం అవుతుండగా.. రాను రాను ఇది మరింత జఠిలమైతున్నది. నగరంలో ఏటా పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా పార్కింగ్ యార్డులను నిర్మించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. ఇందుకోసం హెచ్ఏం డీఏ, మెట్రో, ఇతర శాఖలతో కలిసి నగరంలో 75కు పైగా అధునాతన పార్కింగ్ యార్డులను నిర్మించాలని ప్రతిపాదించారు. తొలి దశలో 25 ప్రాంతాల్లో మల్టీ లెవల్ పార్కింగ్ యార్డులను నిర్మించడానికి ఆమోదం తెలిపారు. పైలట్ ప్రాజెక్టుగా నగరంలో తొలి మల్టీ లెవల్ పార్కింగ్ యార్డును మెట్రో సంస్థ నిర్మించడం మొదలుపెట్టింది. కానీ మెట్రో సంస్థకు ఇది గిట్టుబాటు కాకపోవడంతో గడిచిన కొంత కాలంగా ఈ ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యం జరుగుతున్నది. నాంపల్లి వద్ద 12 అంతస్తుల ఎత్తులో మల్టీ లెవల్ పార్కింగ్ నిర్మాణంతో ఏకంగా 300-400 వాహనాలను నిలిపివేసే అవకాశమున్నది. కానీ ఈ ప్రాజెక్టు పనులను పూర్తి చేయడంపై కాంగ్రెస్ సర్కారు ఆసక్తి చూపడం లేదు. కానీ కేబీఆర్ పార్కు వద్ద 30 వాహనాలు నిలిపే మల్టీ లెవల్ పార్కింగ్ కోసం నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ స్థలాన్ని ఓ ఏజెన్సీకి కట్టబెట్టి ప్రాజెక్టు పనులకు శ్రీకారం చుట్టింది. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం తక్కువే. దీంతోపాటు పరిమిత వాహనదారులకు ఈ సదుపాయం అందుబాటులోకి వస్తోంది. నాంపల్లిలో ఉన్న మల్టీ లెవల్ పార్కింగ్ స్థలానికి కంటే... కేబీఆర్ మల్టీ లెవల్ పార్కింగ్ ప్రాజెక్టును సర్కారు ఉరుకులు పరుగుల మీద చేపడుతున్నది. ఈ ప్రాజెక్టును చివరకు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశంలోనూ తిరస్కరిస్తే, కేవలం ఈ ప్రాజెక్టు ద్వారా కాంగ్రెస్ పార్టీ పెద్దలకు ప్రయోజనం ఉందని.. శరవేగంగా మళ్లీ తెరమీదకు తీసుకువచ్చారు.

ఎన్టీఆర్ గార్డెన్ వద్ద పెయిడ్ పార్కింగ్

పార్కింగ్ పేరిట నిలువు దోపిడీ..

నగరంలోని కొన్ని హోటళ్లు, పెద్ద పెద్ద కార్యాలయాల వద్ద పార్కింగ్ స్థలం లేకపోవడంతో వాహనాలను రోడ్లపైనే నిలుపుతున్నారు. మరోవైపు ప్రస్తుతం వ్యాలెట్ పార్కింగ్ పేరిట అడ్డగోలుగా వసూలు చేస్తున్నారు. ఇక మెట్రో స్టేషన్లకు వచ్చే వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేయడంతో రక్షణ లేకుండా పోయిందని వాహనదారులు వాపోతున్నారు. ఇదిలా ఉంటే హెచ్ఎండీఏ పరిధిలోని బీపీపీలో ట్యాంక్ బండ్ పరిసరాల్లో పలు చోట్ల పార్కింగ్ యార్డుల నిర్వహణ టెండర్ల ప్రతిపాదికన కట్టబెట్టారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ఆ ప్రాంతంలో పెండింగ్‌లో టెండర్లను మళ్లీ పిలవకుండా... 9 నెలల పాటు కాంగ్రెస్ పార్టీలో చేరిన ఓ ఎమ్మెల్యే చెప్పిన వ్యక్తికి పార్కింగ్ వసూలు చేసుకునే బాధ్యతలు అప్పగించారు. నిజానికి టెండర్ల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. కానీ నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ పనులను కట్టబెట్టి, లక్షల రూపాయల ఆదాయాన్ని కోల్పోయింది. ఆ తర్వాత విషయం వెలుగులోకి రావడంతో హెచ్ ఎండీఏ కమిషనర్ చొరవ తీసుకుని బీపీపీ పరిధిలో పార్కింగ్ టెండర్లకు చర్యలు తీసుకున్నారు.

రోడ్లపైనే వాహనాలు

కేబీఆర్ పార్క్ వద్ద నిత్యం ఉదయాన్నే వచ్చే వాహనదారులకు పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్లకు ఇరువైపులా వాహనాలను నిలుపుతుంటారు. దీనికి సమీపంలోనే ఎకరం విస్తీర్ణంలోనే

(మిగతా IVవ పేజీలో)

చెత్తలో కూర్చొని.. నిరసన తెలిపి..

మల్కాజిగిరి, మార్చి 17 : బొల్లారం లోని హిందూ శ్మశాన వాటికను చెత్త డంపింగ్ యార్డ్ గా రాంకీ , జీహెచ్ఎంసీ మార్చడాన్ని నిరసిస్తూ.. రెండో రోజు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి చెత్తలో కూర్చొని నిరసన తెలిపారు. స్టాప్ ఇల్లీగల్ డంపింగ్ ఇన్ హిందూ గ్రేవ్ యార్డ్ అనే నినాదంతో దాదాపు 40 కాలనీల ప్రజలతో కలిసి ధర్నా నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. సమస్య పరిష్కారమయ్యేంత వరకు ప్రతి రోజూ ధర్నా నిర్వహిస్తామన్నారు. నిరసనలో శాంతి శ్రీనివాస్‌రెడ్డి , రమేశ్, పరమేశ్, అనిల్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ మ్యాట్ రూఫ్‌లు లేక...

సిటీబ్యూరో: రెండు నిమిషాల సిగ్నల్స్ వద్ద వెయింటింగ్ చేస్తున్న వాహనదారులు ఎండల వేడికి వడదెబ్బ తగిలే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద గ్రీన్ మ్యాట్స్ రూఫ్‌లను ఏర్పాటు చేయాల్సిన జీహెచ్ఎంసీ మీనమేషాలు లెక్కిస్తున్నది. గత ఏడాది ప్రయోగాత్మకంగా లిబర్టీ చౌరస్తాలో గ్రీన్ మ్యాట్స్ ఏర్పాటు చేసిన అధికారులు.. ప్రస్తుతం ఏ కూడళ్లలోనూ ఆ దిశగా ప్రయత్నాలు చేయడం లేదు. వాహనదారులకు ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కల్పించేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ హైదరాబాద్ కమిటీ సభ్యులు సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. కమిషనర్ ఇలంబర్తి ప్రత్యేక చొరవ తీసుకుని ప్రధాన కూడళ్ల వద్ద గ్రీన్ మ్యాట్స్ , అలాగే చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని పీవైఎల్ కమిటీ సభ్యులు కేఎస్ ప్రదీప్, రవికుమార్, కృష్ణ తదితరులు కోరారు.

గాంధీ వైద్యశాలలో డీఎంఈ నరేంద్రకుమార్ తనిఖీలు

జెరియాట్రిక్ వార్డు ప్రారంభించండి

గాంధీ అధికారులను ఆదేశించిన డీఎంఈ

సిటీబ్యూరో/బన్సీలాల్‌పేట్, మార్చి17, (నమస్తే తెలంగాణ): గాంధీలో వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన జెరియాట్రిక్ వార్డు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్(డీఎంఈ) డాక్టర్ నరేంద్రకుమార్ అధికారులను ఆదేశించారు. ఇటీవల 'నమస్తే'లో 'వృద్ధులంటే చిన్నచూపా..?' అనే శీర్షికన ప్రచురించిన కథనానికి ఆయన స్పందించి ఈ జెరియాట్రిక్ వార్డు ప్రారంభించి అందులో కావాల్సిన సౌకర్యాలను ఏర్పాటు చేయాలని గాంధీ సూపరింటెండెంట్ సీహెచ్ రాజకుమారిని ఆదేశించారు. సోమవారం డీఎంఈ నరేంద్రకుమార్ గాంధీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతీవార్డు తిరిగి రోగులకు అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అత్యవసర విభాగంలోని పై కప్పు ఊడి ప్రమాదకరంగా కనిపించడంతో అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. అ తరువాత ఈఎన్‌టీ విభాగంలో గోడలపైన అశుభ్రతను చూసి శుభ్రం చేయాలని ఆదేశాలు జారీచేశారు. ఐవీఎఫ్ విభాగాల్లో నెలకొన్న సమస్యలు ఆరా తీశారు. ఆస్పత్రిలో డ్రైనేజీ పైప్ లైన్ వ్యవస్థ, ఫైర్ ఫైటింగ్‌సిస్టమ్, పారిశుధ్య వ్యవస్థ ప్రక్షాళన పనులు జరుగుతున్న కారణంగా రోగులకు అసౌకర్యంగా ఉందని, ఈ సమస్యలను దృష్టిలో పెట్టుకొని వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశాలు జారీ చేసినట్లు డీఎంఈ తెలిపారు.

నమస్తే ఎఫెక్ట్

సర్క్యులర్ రద్దు చేయాల్సిందే..

ఉస్మానియా వీసీ జారీ చేసిన సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ.. బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో నేతలు సోమవారం అసెంబ్లీ ముట్టడికి యత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు.

హోరెత్తిన ఓయూ

సర్క్యులర్‌పై ఆగ్రహావేశాలు.. సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీలో అన్ని రకాల ఆందోళనలను నిషేధిస్తూ అధికారులు సర్క్యులర్ విడుదల చేసిన నేపథ్యంలో ఓయూలో తీవ్ర ఉద్రిక్తత కొనసాగుతోంది. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మెయిన్ లైబ్రరీ నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం లా కళాశాల ఆవరణలోని అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించేందుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో విద్యార్థులు ఓయూ వీసీ, ప్రభుత్వం, పోలీసులకు వ్యతిరేకంగా నినదించారు. పోలీసులు అడ్డుకోగా విద్యార్థులు ప్రతిఘటించారు. ఇరుపక్షాల మధ్య తీవ్ర తోపులాట చోటు చేసుకుంది. విద్యార్థి నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని అంబపేట, నల్లకుంట పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ తమ హక్కుల కోసం పోరాడే విద్యార్థులను అణగదొక్కేందుకు ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని నిర్బంధం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థి సంఘం నేతలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

శాసనమండలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కాలుష్యాన్ని నియంత్రించాలి

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్, మార్చి17: కుత్బుల్లాపూర్ నియోజక వర్గం ఔటర్ రింగ్ రోడ్డును ఆనుకొని ఉన్న దుండిగల్ తండా లు, నిజాంపేట, ప్రగతి నగర్, బాచుపల్లి తదితర ప్రాంతాల్లో పరిశ్రమలు వెదజల్లుతున్న వాయు, రసాయన కాలుష్యాన్ని(ఇండస్ట్రియల్ పొల్యూషన్) నియంత్రించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. సోమవారం శాసనమండలిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బొల్లారం, కాజీపల్లి, జీడిమెట్ల, గడ్డపోతారం పారిశ్రామిక వాడల నుంచి వెలువడుతున్న పారిశ్రామిక కాలుష్యంతో బాచుపల్లి, నిజాంపేట, ప్రగతి నగర్ తదితర ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాంకి వేస్ట్ మేనేజ్‌మెంట్ సంస్థలో రసాయన వ్యర్థాలు భూ భూగర్భంలోకి పంపింగ్‌చేస్తుండడంతో పరిసర ప్రాంతాల్లోని భూగర్భ జలాలు కలుషితమై చుట్టూ కిలోమీటరు దూరంలో ని బోరు బావుల నుంచి రసాయన వ్యర్థాలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయమై తాను పీసీపీ బోర్డు మెంబర్ తో మాట్లాడినా ఫలితం లేకుండా పోతున్నదన్నారు.

బీసీ నిరుద్యోగులకు

ఉచిత డ్రైవింగ్ శిక్షణ

సిటీ బ్యూరో, మార్చి 17 (నమస్తే తెలంగాణ): తెలంగాణ వెనుకబడిన తరగతుల ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్ జిల్లా ప్రజలకు ఉచిత డ్రైవింగ్ శిక్షణ అందించనున్నట్లు వీసీ, మేనేజింగ్ డైరెక్టర్ మల్లయ్య తెలిపారు. నిరుద్యోగ బీసీ యువతకు టీజీఎస్ ఆర్టీసీ హకీంపేటలో ఈ శిక్షణను ఇవ్వనున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెవీ మోటార్ వాహనం, తేలికపాటి మోటార్ వాహనం నడిపేందుకు 38 రోజుల పాటు శిక్షణతో పాటు భోజనం, వసతి కల్పించనున్నట్లు వెల్లడించారు. ఎనిమిదో తరగతి చదివిన 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగిన వారు దరఖాస్తు పత్రాలను సంబంధిత జిల్లా బీసీ అభివృద్ధి కార్యాలయంలో ఈనెల 31 లోపు అందజేయాలని సూచించారు. ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ ప్రతాలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

4 నెలలుగా జీతాలు ఇవ్వట్లే..

కలెక్టరేట్ వద్ద కార్మికుల ధర్నా

మేడ్చల్ కలెక్టరేట్, మార్చి 17 : 4 నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని జిల్లాలోని పలు గ్రామాల పంచాయతీ కార్మికులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి జీతాలు ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, శివబాబు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మన్సూరాబాద్‌లో బీఆర్ఎస్‌పై పోలీసు జులుం

ప్రోటోకాల్ పేరిట బీజేపీ అనవసరపు రగడ

బీఆర్ఎస్ నేతలతో పోలీసుల దురుసు ప్రవర్తన

మన్సూరాబాద్, మార్చి 17: మన్సూరాబాద్ డివిజన్‌లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈనెల 12న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని సరస్వతి నగర్ కాలనీ, వీరన్న గుట్ట, విజయనగర్ కాలనీల్లో రూ.71 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అయితే సదరు శంకుస్థాపనల విషయంలో ఎమ్మెల్యే ప్రోటోకాల్ విస్మరించారని..కాలనీవాసులకు సమాచారం ఇచ్చిన తర్వాత తనకు తెలియజేశారంటూ.. ప్రోటోకాల్ నిబంధనలు పాటించనందున ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి శంకుస్థాపనలు చేసిన పనులను తిరిగి తాను ప్రారంభిస్తానని కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి సోమవారం ఉదయం సరస్వతి నగర్ కాలనీకి చేరుకున్నారు. విషయాన్ని తెలుసుకున్న బీఆర్ఎస్ నేత జక్కిడి రఘువీర్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి శంకుస్థాపనలు చేసిన పనులకు తిరిగి కార్పొరేటర్ రెండో సారి ఎలా శంకుస్థాపనలు చేస్తారని ప్రశ్నించేందుకు బీఆర్ఎస్ శ్రేణులు సమాయత్తమయ్యారు. కార్పొరేటర్ ను ప్రశ్నించేందుకు బీఆర్ఎస్ నాయకులు సిద్ధమవుతుండగా, అప్పటికే సరస్వతి నగర్ కాలనీ కి చేరుకున్న ఎల్బీనగర్ సీఐ వినోద్ కుమార్ తదితరులు బీఆర్ఎస్ నాయకులను అడ్డుకొని అక్కడి నుంచి పంపించి వేశారు.

బీఆర్ఎస్ నేతలను ఈడ్చుకెళ్లిన పోలీసులు..

సరస్వతి నగర్ కాలనీ నుంచి వీరన్న గుట్టకు తరలి వెళ్లిన బీఆర్ఎస్ శ్రేణులను హయత్ నగర్, వనస్థలిపురం సీఐలు అడ్డుకున్నారు. శంకుస్థాపన విషయంలో కార్పొరేటర్ సమాధానం చెప్పాకే తాము ఇక్కడి నుంచి కదులుతామంటూ బీఆర్ఎస్ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి తదితరులు అక్కడే భీష్మించుకుని కూర్చున్నారు. జక్కిడి రఘువీర్ రెడ్డి తో పాటు మరికొందరిని పోలీసులు ఈడ్చుకొని లాక్కెళ్లి పోలీసు వ్యానులో అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్‌కు తరలించారు. అసభ్యకరమైన పదజాలంతో పోలీసులు తనను దూషించారని జక్కిడి రఘువీర్ రెడ్డి ఆరోపించారు. పోలీసులు బీజేపీ కార్పొరేటర్ కు వత్తాసు పలుకుతూ తమతో దురుసుగా వ్యవహరించారని.. పోలీసులు బీజేపీకి ఏజెంట్లుగా మారిపోయారంటూ బీఆర్ఎస్ శ్రేణులు నినాదాలు చేశారు. పోలీసులతో జరిగిన తోపులాటలో బీఆర్ఎస్ నేత జక్కిడి రఘువీర్ రెడ్డితో పాటు పలువురికి స్వల్ప గాయాలయ్యాయి.

బీఆర్ఎస్ నేతలను పోలీసులు బలవంతంగా లాక్కెళ్తున్న పోలీసులు